క్లుప్తంగా

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థిని రిజ్వానాబేగంను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీలో 971 మార్కులు సాధించి ఉమ్మడి జిల్లాలో టాపర్‌గా నిలిచిన కె.రిజ్వానాబేగం అనే విద్యార్థినిని అధ్యాపకులు గురువారం అభినందించారు. గురువారం స్థానిక కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ విజయరాణి ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. రిజ్వానాబేగం ఇంటర్‌లో టాపర్‌గా నిలవడమే కాకుండా వీఐటీ (వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), అమరావతిలో ఉచిత ఇంజినీరింగ్ విద్య చదివేందుకు సీటు సాధించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ అన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ఎమ్మిగనూరుటౌన్: ముచ్చుమర్రిలో మైనర్ బాలికను అత్యాచారం చేసి హత్యచేసిన కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో పలు ప్రజాసంఘాలు, మానవతావాదులు, విద్యార్థి, యువజన, జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థినులతో కలిసి ర్యాలీ చేపట్టి, సోమప్ప సర్కిల్‌లో మానవహారంగా నిలిచారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఆయా సంఘాల నాయకులు గణేష్, యాపీలయ్య, రంగన్న, వీరేష్‌యాదవ్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసి నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్ కోరారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గోనెగండ్ల మండలంలో దాదాపు 26 గ్రామాలు ఉన్నాయని, అయినా మండలంలో సంక్షేమ హాస్టల్ లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వేణు, శివ పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేయించుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లోని కౌలు రైతులు గుర్తింపు కార్డులకోసం పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి మహేశ్వరరెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని కలుగోట్ల, రాళ్లదొడ్డి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో కౌలు రైతులు గుర్తింపు, కౌలు కార్డుల పంపిణీ కార్యాక్రమాన్ని నిర్వహించారు.

బాధితులకు పరామర్శ

ఎమ్మిగనూరుటౌన్/ఎమ్మిగనూరురూరల్:మండల పరిధిలోని కోటేకల్ గ్రామంలో మొహర్రం పండుగ సందర్భంగా జరిగిన ఘర్షణలో గాయపడ్డ దళితులను ఎంఆర్‌పీఎస్, జై భీం ఎంఆర్‌పీఎస్, కేవీపీఎస్ నాయకులు ఆనంద్ చైతన్య, చిక్కం జానయ్య, దేవసహాయం వేర్వేరుగా ప్రభుత్వ అసుపత్రికి వెళ్లి పరామర్శించారు. దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని వారు కోరారు.

గుండమ్మ కుటుంబానికి రక్షణ కల్పించాలి

ఆదోని రూరల్: హత్యకు గురైన మాదిగ గుండమ్మ కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని దళిత ప్రజా సంఘాల కన్వీనర్ రామతీర్థం అమ్రేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నాగనాథనహళ్లి గ్రామస్తులతో పాటు 200 మంది ఆదోని పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి సత్యం టాకీస్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి, సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జైభీమ్ యువత మారెప్ప, బీఎస్పీ ఆలూరు ఇన్‌చార్జ్ రామలింగ, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా మహిళా అధ్యక్షురాలు కదిరికోట బతుకమ్మ, సుమాల చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి

పెద్దకడబూరు: రైతులు వ్యవసాయాధికారులు సూచించే యాజమాన్య పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించాలని ఆదోని వ్యవసాయ సహాయ సంచాలకులు అరుణకుమారి సూచించారు. మండల పరిధిలోని తారాపురం గ్రామంలో రైతులు సాగుచేసిన నూతన వేరుశనగ రకం (విశిష్ట) పంటలను మండల వ్యవసాయ అధికారి ఎం.వరప్రసాద్‌తో కలసి గురువారం పరిశీలించారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో నిలువ ఉంచిన ఎరువులను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి

ఆదోని రూరల్: 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం, కంపెనీల ద్వారా రావాల్సిన ఇన్సూరెన్స్ చెల్లించాలని రైతు సంఘం మండల నాయకులు బాషా, హనుమంతరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గణేకల్, హాన్వాల్ గ్రామ సచివాలయాల ఎదుట ఆందోళన నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందించారు. రామాంజనేయులు, కృష్ణ, గోవిందరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

➡ ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన పట్టణంలోని వెంకన్నబావిపేటలో ఆరేళ్ల బాలుడు కేదర్‌నాథ్ ప్రతిరోజూ ఇంటి దగ్గరలో ఉన్న పాఠశాలకు వెళ్లేవాడు. అక్కడ కుక్కల బెడద తీవ్రంగా ఉంది. అయితే కుక్క ఎంగిలిని ఆ బాలుడు ఎలా తాకాడో ఎవరికీ తెలియదు. ఆ కుక్కకు రేబీస్ వ్యాధి ఉంది. రెండు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న బాలుడిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. రేబీస్ అటాక్ అయ్యిందని, కర్నూలులో అడ్మిట్ చేయగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు.



➡ ఈనెల 14న రాజీవ్‌గాంధీనగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న ఆరేళ్ల బాలుడు రాము తల భాగంలో కుక్క కరిచింది. గాయాలపాలైన బాలుడిని కుటుంబ సభ్యులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. ఇలా ప్రతిరోజూ 10 నుంచి 20 మంది కుక్కకాటుకు గురై గాయాలపావుతున్నారు. అవగాహన ఉన్న వారు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తున్నారు. చిన్న గాయం అయ్యిందని అవగాహన లేని వారు నిర్లక్ష్యం చేయడంతో ప్రాణాంతకంగా మారి ప్రాణాలు పోయిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.

వేటాడుతున్న గ్రామసింహాలు

- ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా శునకాల సంచారం
- వాహనచోదకులు, నడిచేవెళ్లే వారిపై వెంటాడి గాయపరుస్తున్న వైనం
- ఆదోనిలో రోజుకు 10 నుంచి 20 కుక్క కాటు కేసులు
- అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకమంటున్న వైద్యులు



ఆదోని పట్టణంలోని వీధుల్లో గుంపులు గుంపులుగా ఉన్న కుక్కలు

ఆదోని అర్బన్: పట్టణంలో కుక్కల బెడద ప్రజలకు అతి పెద్ద సమస్యగా మారింది. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా చిన్న వయస్సు నుంచి పెద్ద వయస్సు ఉన్న వారిపై, బైకుపై వెళ్తున్న వారిపై, పశువులు, గొర్రెల వెంట పడుతూ దాడి చేస్తున్నాయి. రాత్రివేళ అయితే బయట కాలు పెట్టలేని పరిస్థితి. ద్విచక్ర వాహనచోదకుల వెంట పడుతుండడంతో వారు కిందపడి గాయాలపాలవుతున్నారు. వీటిని నియంత్రించడంలో అధికారులు తీవ్రంగా విఫలమవుతున్నారు. అంతేగాకుండా వాటి సంతతి తగ్గించే విషయంపై కూడా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు తీవ్రంగా మండి పడుతున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి అయినా స్పందించి ఆదోనికి పెద్ద సమస్యగా, ప్రాణాంతకంగా మారిన కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

పట్టణంలో 42 వార్డులు

ఆదోని పట్టణంలో 42 వార్డులు ఉన్నాయి. ఒక్కొక్క వార్డులో 40 నుంచి 60 వరకు కుక్కలు ఉన్నాయి. అందులో కొన్ని పెంపుడు కుక్కలు... మరికొన్ని వీధి కుక్కలు ఉన్నాయి. ప్రధాన కూడళ్లల్లో మాంసం, చేపల విక్రయ కేంద్రాలు, పెద్దపెద్ద హోటళ్ల వద్ద శునకాలు తిష్ట వేస్తున్నాయి. 15 నుంచి 20 కుక్కల వరకు గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రి, పగలు వాహనాల వెంబడి పరుగులు తీస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఎక్కువగా చిన్నపిల్లలను కరిచి గాయాలు చేస్తున్నాయి. పిచ్చి కుక్కలైతే ఎవరిని పడితే వారిని కరిచి ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

రేబీస్ సోకిన కుక్కల లక్షణాలు ఇలా....

- కరిచిన ఏ కుక్క అయినా 14 రోజులపాటు లక్షణాలు పరిశీలించాయి. రేబీస్ వ్యాధి సోకిన కుక్క ఇంట్లో వారి మాట వినదు. ఇంట్లో ఆహారం సరిగా తీసుకోదు. తరచూ నోటి నుంచి సొంగ కారుస్తూ ఉంటుంది. అంతేగాకుండా రెండుకాళ్ల మధ్యలో తోక ముడుచుకుంటున్న దానిని బట్టి కూడా రేబీస్ సోకిన కుక్కలా గుర్తించవచ్చు.

కుక్కకాటుకు గురైతే తీసుకోవాల్సిన చర్యలు

- కుక్క కరిచిన మరుక్షణం ట్యాప్ వాటర్‌తో, డిటర్జెంట్ సోప్(బట్టలు ఉతికే సబ్బు)తో కడగాలి. దీంతో 90 శాతం వైరస్ సోకకుండా ఉంటుంది.
- గాయానికి కట్టు కట్టకూడదు. రక్తం పోతుందని కట్టుకడితే వైరస్ మరింతగా వ్యాపించే ప్రమాదం ఉంది.
- వెంటనే డాక్టర్‌ను సంప్రదించి రేబీస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కుక్క కరిచిన చోటు, విధానం, రేబీస్ కుక్క అయితే దానిని బట్టి ఐదు నుంచి ఏడు ఇంజెక్షన్లు వేస్తారు.
- పిచ్చికుక్క (రేబీస్) కరిస్తే దానికి హీనోగ్లాబిన్ ఇంజెక్షన్ వేయించుకోవాలి. అది కర్నూలులో మాత్రమే దొరుకుతుంది. ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో లేదు.

నెలకు 200 నుంచి 300 వరకు కేసులు నమోదు

ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రతిరోజూ 10 నుంచి 15 మంది వరకు కుక్కకాటుకు కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఈ విధంగా నెలకు 200 నుంచి 300 మంది వరకు రేబీస్ వ్యాక్సిన్ కోసం ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. నెలకు 750 నుంచి 800 డోసుల వరకు రేబీస్ వ్యాక్సిన్ వేస్తున్నారు. ఒకసారి కుక్క కాటు వేసిందంటే నాలుగు నుంచి ఐదు సార్లు రేబీస్ వ్యాక్సిన్ వేసుకోవాల్సిందే. మొదటిది జీరో డోస్, మూడో రోజు రెండో డోసు, ఏడో రోజు మూడో డోసు, 14వ రోజు నాలుగో డోసు, 28వ రోజు ఐదు డోసుల ప్రకారం రేబీస్ వ్యాక్సిన్ వేసుకోవాల్సిందేనని వైద్యులు సూచిస్తున్నారు.

ఏ కుక్క కరిచినా వైద్యుడిని సంప్రదించాలి

సాధారణంగా చాలామందిలో వీధి కుక్క కరిస్తేనే రేబీస్ వ్యాధి సోకుతుందన్న భావన ఉంటుంది. అయితే వీధి కుక్కలే కాదు పెంపుడు కుక్కలు కరిచినా రేబీస్ వ్యాధి సోకుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇలా ఏ కుక్క కరిచినా వెంటనే వైద్యుడి వద్దకు వెళ్లి యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేసుకోవాలి. లేని పక్షంలో కరిచిన ప్రదేశాన్ని బట్టి.... తలపై కరిస్తే మెదడు దెబ్బతిని పక్షవాతం సోకుతుంది. నాలుక, గొంతు పనిచేయకుండా ఆహారం తినే అవకాశం లేకుండా పోతుంది. నీరు చూసినా భయపడే పరిస్థితి వస్తుంది. చివరకు చికిత్సకు లొంగకుండా ప్రాణాంతకమవుతుంది. కరిచింది మన ఇంట్లో కుక్కే కదా అన్న భావన వీడి తక్షణమే చికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పెంపుడు కుక్కలను వీధి కుక్కలతో కలవకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రాణం పోయినా అధికారులు పట్టించుకోవడం లేదు



కుక్క కాటు వల్ల గత ఐదు నెలల క్రితం నా ఆరేళ్ల కుమారుడిని పోగొట్టుకున్నా. కుక్కల బెడద వెంకన్నపేటలో తీవ్రంగా ఉందని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. రా తన కుమారుడు కుక్కకాటు వల్ల ప్రాణం పోయిందని విన్నవించినా ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

– శ్రీనివాసులు, ఆదోని

రాజీవ్‌గాంధీనగర్‌లో వంద కుక్కలు ఉన్నాయి



పట్టణంలోని రాజీవ్‌గాంధీనగర్‌లో వందకు పైగా కుక్కలు ఉన్నాయి. తమ కుమారుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా పోట్లాడుకుంటూ వచ్చి నా కుమారుడి తలపై కాటు వేసింది. పలు మార్లు అధికారులకు కుక్కల బెడద నుంచి కాపాడాలని విన్నవించినా అధికారులు పెడచెవిన పెడుతున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అయినా స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలి.

– జంబన్న, ఆదోని

నిర్లక్ష్యం చేయవద్దు



కుక్క కరిచిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించి వ్యాక్సిన్ వేయించుకోవాలి. అది ఏమి చేస్తుందిలే అనుకుంటే ప్రాణానికే ముప్పు. ఆ కుక్క పెంపుడు కుక్క అయినా, వీధి కుక్క అయినా నిర్లక్ష్యం చేయెద్దు. కనీసం ఐదు నుంచి 7 వరకు ఇంజెక్షన్లు వేసుకోవాల్సిందే. ప్రతిరోజూ 10 నుంచి 20 వరకు కుక్కకాటుకు గురై ఆస్పత్రికి వస్తున్నారు. కొత్త వారికి కాటుకు గురైన వారికి మొత్తం నెలకు 750 నుంచి 800 మందికి వ్యాక్సిన్ వేస్తున్నాం. ఆస్పత్రిలో వ్యాక్సిన్ కొరత లేదు.

– శ్రీనివాస్‌నాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్, ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

వాహనదారుడికి హెల్మెట్టే శ్రీరామరక్ష



ఆదోనిలో మాట్లాడుతున్న జడ్జి సుధ

ఆదోని రూరల్: ద్విచక్ర వాహనదారుడికి హెల్మెట్టే శ్రీరామరక్ష అని ఆదోని రెండవ అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ అన్నారు. గురువారం ఆదోని మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణ నుంచి పట్టణ ప్రధాన రోడ్ల వరకు హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ నేటి యువత బైక్‌లపై మోజుతో హెల్మెట్ వాడకుండా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, ఎంపీఐ సిసిర దీప్తి, ట్రాఫిక్ సీఐ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: మోటర్ బైక్ నడిపే వారు కచ్చితంగా హెల్మెట్‌ను ధరిస్తేనే ప్రమాదాలు జరిగితే ప్రాణాలు కాపాడుకోగలరని స్థానిక జూనియర్ సివిజ్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురురాజారావు అన్నారు. గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణ నుంచి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు న్యాయవాదులు, పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు దామోదర్‌రెడ్డి, రంగనాథ్, సాల్మోన్‌రాజ్, మురళీకృష్ణ, గురుప్రసాద్, ఎంకన్న, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

వేలాల్లో పాల్గొనరాదనడం సమంజసంకాదు



మాట్లాడుతున్న చంద్రకాంత్‌రెడ్డి

ఆదోని టౌన్: మున్సిపల్ వేలం పాటల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనకూడదని కూటమి నాయకులు హెచ్చరికలు జారీ చేయడం ఎంతవరకు సబబని వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నరసింహులు, బాషా చంద్రకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత టీడీపీ పాలనలో 2014–2019 సంవత్సరాల్లో వివిధ మార్కెట్లకు సంబంధించిన వేలం పాటల్లో ఆ పార్టీ నాయకులు రూ.లక్షలకు లక్షలు వేలం పాడి మార్కెట్లను దక్కించుకుని మున్సిపాలిటీకి డబ్బు చెల్లించకుండా కాలయాపన చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్లను దక్కించుకున్న కాంట్రాక్టర్లు సకాలంలో బిల్లులు చెల్లించి మున్సిపాలిటీ, ఆదోని అభివృద్ధికి సహకరించారని చెప్పారు. రెండు రోజులక్రితం జరిగిన మార్కెట్ వేలం పాటలను వాయిదా వేయడం భావ్యం కాదన్నారు. మున్సిపల్ కౌన్సిల్, చైర్‌పర్సన్, పట్టణ ప్రముఖులు, ప్రజల అభిప్రాయాల మేరకు మార్కెట్‌ల వేలం పాటలు నిర్వహించాల్సి ఉండేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, తాము చెప్పిందే చేయాలని అధికారులకు హుకుం జారీ చేయడం సమంజసం కాదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వేలం పాటలు పార్టీలకు అతీతంగా జరిగాయన్నారు. అన్ని పార్టీల నాయకులు వేలంలో పాల్గొని స్వేచ్ఛగా పాటలు పాడారని చెప్పారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, కౌన్సిలర్లు చలపతి, నాగరాజ్, రామలింగేశ్వరయాదవ్, భాస్కర్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ సిద్దలింగమూర్తి

ఎమ్మిగనూరురూరల్: నియోజకవర్గంలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్దలింగమూర్తి సూచించారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎమ్మిగనూరు, నందవరం, పెద్దకడుబూరు, గోనెగండ్ల మండలాల ఏపీఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 5,336 గృహాలు మంజూరు కాగా, వాటిలో 2,529 పూర్తయ్యాయని, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. అవి త్వరితగతిగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఈఈ రవికుమార్, డీఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలో ఏడుగురు మట్కా రాస్తున్న బీటర్లపై టూటౌన్ పోలీసులు గురువారం దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.13 వేల నగదు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో భోగేష్‌తో పాటు మరో ఆరు మందిని అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు ఘర్షణకు దిగడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ నరసింహరాజు తెలిపారు. బుధవారం మండలంలోని సలకలకొండ గ్రామంలో పీర్లదేవుళ్ల వేడుకల్లో ఇరువర్గాల మధ్య గొడవ జరిగిందన్నారు. గురువారం వారు ఫిర్యాదు చేయడానికి తాలూకా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారని, మాటామాటా పెరగడంతో పరస్పరం దాడులు చేసుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన పది మందిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 9 మంది వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అయితే వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లేష్‌ను కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో టీడీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

పెండింగ్ వేతనాలు మంజూరు చేయండి

గోనెగండ్ల : సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని సమగ్రశిక్ష ఉద్యోగులు పుల్లన్న, కళ్యాణి, రవికుమార్ కోరారు. గోనెగండ్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కవిత, తిమ్మప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి
- సుంకేశ్వరిలో పర్యటన



సుంకేశ్వరిలో తాగునీటి బోరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశించారు. మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో గురువారం పర్యటించారు. గ్రామంలో ఇటీవల అతిసార వ్యాధితో జ్యోతి (4) అనే చిన్నారి మృతి చెందడం బాధకరమన్నారు. మరికొంత మంది ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందిన వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సరఫరా అవుతున్న తాగునీటి బోరు పరిశీలించారు. గ్రామంలోని పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు ఆరోగ్య పరిస్థితి విషయాలపై ఆరా తీశారు. చిన్న పాటి వాంతులు, విరేచనాలు వచ్చిన వెంటనే వైద్యాధికారులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మృతి చెందిన జ్యోతి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయించి సురక్షిత మంచినీటిని అందించేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో అధికారులతో సమావేశమైయ్యారు. తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని, ఇళ్ల ముందు మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుని బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించి గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు భీమారెడ్డి, సర్పంచ్ ముత్రన్న తదితరులు ఉన్నారు.

ఘనంగా గ్యారతారీఖ్ వేడుకలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం గ్యారతారీఖ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. స్వామి వారం గురువారంతో పాటు మొహర్రం పండుగ మరుసటి రోజే గ్యారతారీఖ్ వేడుకలు రావడంతో దర్గాకు భక్తులు అధికంగా తరలి వచ్చారు. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

తమిళనాడుకు వెళ్లి రక్తదానం



రక్తదానం చేస్తున్న విరూపాక్షిస్వామి

ఆదోని అర్బన్: ఆదోని జనసేవా సామాజిక సేవా సంస్థ కార్యదర్శి విరూపాక్షిస్వామి తమిళనాడులోని వేలూరు సీఎంసీ రాణిపేట్ మెడికల్ క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఏపీలోని నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల గ్రామానికి చెందిన వెంకటేష్ అనే రోగి కిడ్నీ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స కోసం వేలూరు ఆస్పత్రిలో చేరాడు. చాలా అరుదుగా దొరికే బ్లడ్ గ్రూప్ ఏ నెగెటివ్ అందుబాటులో లేకపోవడంతో అల్లరో బ్లడ్ ఆర్గనైజర్ తిరుపతి వారు విరూపాక్షిస్వామికి సమాచారం అందించారు. వెంటనే ఆదోని నుంచి బుధవారం వేలూరుకు వెళ్లి 37వ సారి రక్తదానం చేసినట్లు విరూపాక్షిస్వామి తెలిపారు. రక్తం అవసరమైన వారు జనసేవా సామాజిక సేవా సంస్థకు సమాచారం అందిస్తే అందుబాటులోకి వస్తామని చెప్పారు.

నాటుసారా స్థావరంపై దాడులు

ఆదోని రూరల్: పట్టణ శివారులోని సింగరాయి కొండల్లోని నాటుసారా స్థావరంపై సెబ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. కొండ గుట్టల వద్ద రెండు స్థావరాల్లో 1700 లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల నాటుసారాని ధ్వంసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ తెలిపారు. స్థావరం నిర్వహిస్తున్న వ్యక్తులు పరారైనట్లు చెప్పారు. వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

రాంజల చెరువును కాపాడుకుందాం



రాంజల చెరువు వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని అర్బన్: రాంజల చెరువును ఆదోని ప్రజలంతా కలిసి కాపాడుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పిలుపునిచ్చారు. గురువారం రాంజల చెరువును అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంకో నాలుగు రోజుల్లో విషపునీరంతా బయటికి వెళ్లిపోతాయని, అనంతరం ఇక్కడ ఉన్న వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ పదార్థాలు, పిచ్చి మొక్కలు అన్నింటినీ తీసివేసి ఎల్‌ఎల్‌సీ కెనాల్ నీటిని, వర్షపు ద్వారా వచ్చిన నీటిని నింపడం జరుగుతుందన్నారు. వాటిని కూడా ఫిల్టర్ చేసి ప్రజలకు పరిశుద్ధమైన నీటిని అందిస్తామన్నారు. ఎన్నో సంవత్సరాలుగా రాంజల చెరువులో చెత్తాచెదారం ఉండిపోయిందని, దానిని బయటకు తీయడంతో అధికారుల కృషి చాలా ఉందన్నారు. ఆదోని ప్రజలు ఇక నుంచి చెత్తను రాంజలలో వేయకూడదని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఈ చలపతి, అధికారులు ఉన్నారు.

సాగు, తాగు నీరు అందించడమే లక్ష్యం



బనవాసిలో జీఆర్‌పీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగునీరు సక్రమంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బనవాసి ఘనీకృత వీర్య అబోతు కేంద్రం, ఏపీ గురుకుల పాఠశాల, కృషి విజ్ఞాన కేంద్రాలను సందర్శించి ఆయా కేంద్రాల అధికారులతో సమస్యలు, తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. అలాగే గురురాఘవేంద్ర, ఆర్‌ఎస్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గురురాఘవేంద్ర ప్రాజెక్ట్ ద్వారా నీటిని సంపూర్ణంగా అందించటమే లక్ష్యమని చెప్పారు. పులికనుమలో ఎప్పుడు నీళ్లు పూర్తి స్థాయిలో ఉండేల అధికారులు చూడాలని ఆదేశించారు. గురురాఘవేంద్ర, ఆర్డీఎస్‌కు, ఎస్ఎల్‌సీ సంబంధించి మరమ్మతులకు ఎంత నిధులు కావాలి అనేది పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో డీడీ శ్రీధర్‌రావు, ఏడీలు చంద్రశేఖర్, కిషోర్, ఆర్డీఎస్ రెగ్యులర్, గురురాఘవేంద్ర ఇన్‌చార్జ్ ఈఈ బాస్కర్‌రెడ్డి, డీఈలు మురళీ, చిదంబర్‌రెడ్డి, ఏఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సేవల అందించటంతో నిర్లక్ష్యం వద్దు

ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు సేవలందించటంలో నిర్లక్ష్యం వహించవద్దని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సూచించారు. గురువారం ప్రభుత్వాసుపత్రిని సందర్శించి వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సూపరిండెంట్ డాక్టర్ మైత్రేయి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బాలజీకుమార్ తదితరులు ఉన్నారు.

మానవ మనుగడకు మొక్కలు పెంచాలి

ఎమ్మిగనూరుటౌన్: మానవ మనుగడకు మొక్కలు పెంచడం ఎంతో అవసరమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మైనారిటీ కాలనీలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి మొక్కలు నాటారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

ఆదోని రూరల్: మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను, హోటళ్లను తక్షణమే తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్.సుదర్శన్, సీపీఐ సీనియర్ నాయకులు కె.లక్ష్మిరెడ్డి, జిల్లా సమితి సభ్యులు టి.వీరేష్ కోరారు. గురువారం స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పత్తికొండ రోడ్డు నుంచి ఆలూరు రోడ్డు వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. అప్పుడే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని, బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ఇళ్ల స్థలాలు ఇచ్చిన వారికి ఆస్తి విలువలను బట్టి పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.విజయ్, లక్ష్మీనారాయణ, రాము, శ్రీనివాసులు, రమేష్, అంజిత్ తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా ఇసుక విధానం

కోసిగి: రాష్ట్రంలో కొత్త ఏర్పాటైన కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం గందరగోళంగా ఉందని, నిరుపేదలకు ఉచితంగా ఇసుక అందడం లేదని సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, రైతు సంఘం మండల అధ్యక్షుడు మూకప్ప అన్నారు. గురువారం కౌతాళం మండలం గుడికంబాలి రీచ్ నుంచి కోసిగి మీదుగా టిప్పర్‌లతో తరలిస్తున్న ఇసుకను పరిశీలించారు. కోసిగిలో ట్రాక్టర్ ఇసుకను రూ.2500 నుంచి రూ.3వేలు వసూళ్లు చేస్తున్నారన్నారు.